క్లుప్తంగా

ఉద్యోగాలు పొందిన వారికి కలెక్టర్ అభినందన



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ సిటీ: వికాసలో ఇటీవల జరిగిన 24/7 ఏఐ సంస్థలో నిర్వహించిన ఇంటర్వ్యూలో 9 మంది నాన్‌వాయిస్ (డిజిటల్ చాట్ అసోసియేట్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. వీరు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ షాన్ మోహన్ సగిలిని కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి రూ.2.4 నుంచి రూ.3.5 లక్షల జీతం ఉంటుందని వికాస పీడీ కె.లచ్చారావు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను, పీడీ లచ్చారావును కలెక్టర్ అభినందించారు.

ఎడతెరిపి లేని వానతో అనారోగ్య సమస్యలు

కాకినాడ రూరల్: ఎడతెరిపి లేని వానతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టరు అడ్డాల సత్యనారాయణ కోరారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో సీజనల్ వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అధిక వర్షాల వలన బ్యాక్టీరియా, వైరస్ సోకి జ్వరాలు, అతిసార బారిన పడే అవకాశం ఉందన్నారు. వేడి ఆహారంతో పాటు కాచి చల్చారిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శిర్డీ సాయి ఆలయంలో శుక్రవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు దన్నాల అప్పారావు, జి.సత్యనారాయణ, బర్లంకి రామారావు తదితరుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు. శనివారం మధ్యాహ్నం బాలికలచే కోలాటం, అనంతరం బాబాకు పల్లకి ఊరేగింపు ఉంటుందని, ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, 11 గంటలకు రైల్వే కల్యాణ మండపంలో భారీ అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

మరిడమ్మ తల్లికి కుంకుమ పూజలు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు

రైల్వే గేటు మీదుగా యథావిధిగా రాకపోకలు



గోపాలపట్నంలో రైల్వే గేటు తెరుచుకోవడంతో యథావిధిగా సాగుతున్న వాహనాల రాకపోకలు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం రైల్వేగేటు ట్రాక్ మరమ్మతుల పనులు పూర్తయ్యాయి. అధికారులు రైల్వే గేటును తెరవడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ నెల 15 నుంచి 18 వరకూ ట్రాక్ మరమ్మతుల నిమిత్తం రైల్వేగేటును అధికారులు మూసివేశారు. దీంతో వాహనదారులు నాలుగు రోజుల పాటు పి.ఇ.చిన్నాయపాలెం, రావికంపాడు రైల్వేగేట్ల ద్వారా రాకపోకలు సాగించి ఇబ్బందులు పడ్డారు. కాగా రెండు రోజుల పాటు కుండపోత వర్షం వల్ల ట్రాక్ పనులకు అంతరాయం కలిగినప్పటికీ ఎట్టకేలకు అధికారులు గోపాలపట్నం రేల్వే గేటుకు మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు. గేటు వద్ద ట్రాక్ దాటేందుకు వాహనాలు వెళ్లే మార్గంలో తారు రోడ్డు వేయాల్సి ఉంది. దీంతో వాహనాల రాకపోకలు ట్రాక్ వద్ద నెమ్మదిగా సాగుతున్నాయి.

అంగన్‌వాడీ చదువులూ అంతంతే



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న టీచర్



పీపీ-1, పీపీ-2 పుస్తకాలు

- ఇంకా చేరని పీపీ-1, పీపీ-2 పుస్తకాలు
- ఉన్న పుస్తకాలతోనే విద్యా బోధన
- కాన్వెంట్లవైపు చూస్తున్న తల్లిదండ్రులు
- పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులదే

కాకినాడ సిటీ: బాల్యదశలో విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరికి ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలను ఆయా కేంద్రాలకు అందజేసేది. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆంగ్ల బోధన అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ-1, పీపీ-2 కిట్లు అందించింది. కాన్వెంట్ తరహాలో ఆంగ్ల బోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించడం ద్వారా పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేవారు. బోధనకు సంబంధించి 2-4 ఏళ్ల లోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు, 4 నుంచి 5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లు అందించేవారు.

పాత పద్ధతిలోనే బోధన..

కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కరప, కాకినాడ రూరల్ మండలాలు, కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కాకినాడ అర్బన్, పెదపూడి మండలాలు ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలో 334 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 9,714 మంది, 7 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 17,671 మంది ఉన్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. ఈ పుస్తకాల్లో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండటంతో తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. నేడు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ చిన్నారులకు కాన్వెంట్లలో చేర్పించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

కొత్త పుస్తకాలు వస్తే కేంద్రాలకు పంపిస్తాం

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలకు పంపుతాం. ప్రస్తుతం కేంద్రాల్లో ఉన్న పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం.

– వై.లక్ష్మి, సీడీపీవో, కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు

జిల్లా కళాకారుల సెల్ కన్వీనర్‌గా చెల్లూరి



చెల్లూరి సత్యనారాయణను అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

బోట్‌క్లబ్: బీజేపీ జిల్లా కళాకారుల సెల్ కన్వీనర్‌గా చెల్లూరి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ కుల వృత్తి కళాకారులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తోందన్నారు. కళాకారులుగా గుర్తింపునకు ఈ హ్యాండీక్రాఫ్ట్ సంస్థ ద్వారా అర్హులందరికీ ఆర్టిషియన్ కార్డు అందిస్తుందన్నారు. కార్డు ఉన్న వారికి బ్యాంకు రుణాలలో ప్రత్యేక రాయితీలు అందిస్తుందన్నారు. విశ్వబ్రాహ్మణులు, వివిధ చేతివృత్తుల వారికి ఈ కార్డులు మంజూరయ్యాయన్నారు. అర్హత కలిగిన ప్రతి కుల వృత్తిదారులు కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన ఈ కార్డుని పొందాలన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ మండలాల్లో పర్యటించి ఈ ఆర్టిషియన్ కార్డులపై అవగాహన సదస్సులు నిర్వహించి లబ్ధి చేకూరే విధంగా ప్రయత్నిస్తానన్నారు. కాకినాడ సౌత్ మండల్ అధ్యక్షులు చెక్క రమేష్, నాయకులు దొడ్డి వీరేంద్ర, గెద్దం వెంకటరమణ పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



శాకంబరి అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



కూరగాయలు, పండ్లతో తయారుచేసిన శివలింగం



శాకంబరిగా దర్శనమిస్తున్న ఉప్పాలమ్మ తల్లి

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. సుమారు ఆరు టన్నుల కూరగాయాలతో ఆలయ పరిసరాలను ఎంతో అందంగా అలంకరించారు. కూరగాయలతో పాటు, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన గోంగూర, కరివేపాకుతో పాటు వివిధ రకాల పండ్లతో అమ్మవారి గర్భాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ సుమారు 100 మంది భక్తులు సహాయంతో ఆలయాన్ని అందంగా అలంకరించినట్లు ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. హోరున వర్షం పడుతున్నా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలు కట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

గ్రామదేవత ఉప్పాలమ్మ తల్లి దర్శనం..

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మ తల్లిని గురుపౌర్ణమి సందర్భంగా శాకంబరిగా అలంకరించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆదివారం కుంకుమ పూజ చేయించుకునే భక్తులకు కాయగూరలతో చేసిన వంటకాలతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారి అలంకరణ, అన్నదానం కార్యక్రమాలను పాట్నీడి సత్యభీమేశ్వరరావు ఆధ్వర్యంలో చేస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

నీటి తరలింపే ప్రథమ కర్తవ్యం

- ముంపునకు గురి కాకుండా ముందు జాగ్రత్త చర్యలు అవసరం
- వ్యవసాయాధికారి రాజేష్



నీట మునిగిన వరి చేలను చూపుతున్న రైతులు

కరప: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట కొన్ని ప్రాంతాల్లో ముంపునకు గురికావడంతో, రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏవీ రాజేష్ సూచించారు. శుక్రవారం రైతులతో పలు ప్రాంతాలను సందర్శించి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. సార్వా నారుమడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నపుడు, మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల విత్తనం కోరగాలి పోసుకొని ఎటువంటి నష్టం జరగదన్నారు. అలా కాక నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవల్సిన అవసరం ఏర్పడుతుందని ఏవో వివరించారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నారు నీట మునిగిన 5 రోజుల లోపు, నీటిని బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలన్నారు. నష్ట నివారణకు నీటిని తీసిన తరువాత 5 సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుందన్నారు. అధిక వర్షాలకు నారుమడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాముల కార్బండిజం, మాంకోజెబ్ కలిసిన మిశ్రమాన్ని పిచికారి చేయాలన్నారు. పంట ఊడ్చిన వెంటనే పిలక దశలో ముంపునకు గురైనట్‌లైతే నీటిని బయటకు తీసివేసి తరువాత పై పాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందని ఏవో రాజేష్ తెలిపారు. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం కలిపి పిచికారి చేయాలని వివరించారు.

మహిళలు, బాలల చట్టాలపై అవగాహన అవసరం



తిమ్మాపురంలో చట్టాలపై అవగాహన కలిగిస్తున్న ఐసీడీఎస్, బాలల సంక్షేమ అధికారులు

కాకినాడ రూరల్: మహిళలు, బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు ప్రవీణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వెంకట్రావు సూచించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు నేపథ్యంలో కలెక్టరు ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు లత, శకుంతల, జ్యోతి, సురేఖ, లక్ష్మి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో ఫ్లెక్సీల నిషేధం

- ఫ్లెక్సీ ఫ్రీ రోడ్స్' దిశగా అడుగులు
- ఆదివారం లోపుగా తొలగించాలి
- కమిషనర్ వెంకటరావు ఆదేశం



రైల్వే ట్రాక్ ప్రాంతంలో నీరు నిలిచిపోతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: నగర సుందరీకరణ, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని దశల వారీ కార్యాచరణలో భాగంగా నగరంలోని ముఖ్య ప్రాంతాలలో ఫ్లెక్సీలు, హోర్డింగులు బ్యానర్లను నిషేధిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు నిర్దేశించిన ప్రాంతాలను ఫ్లెక్సీ ఫ్రీ రోడ్స్ గా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. తొలి విడతలో నిర్ణయించినట్టు భానుగుడి నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా తీర్చిదిద్దడంతో తాజాగా సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి, టూ టౌన్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్ జగన్నాథపురం వంతెన, కోకిల సెంటర్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ (సినిమా రోడ్డు) ప్రాంతాల్లో కూడా వీటిని నిషేధిస్తున్నామన్నారు. ఆదివారంలోపుగా వాటిని ఏర్పాటు చేసినవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేనిపక్షంలో ఈ నెల 22వ తేదీ నుంచి తమ సిబ్బంది వాటిని తొలగించి అందుకు అయిన వ్యయాన్ని బాధ్యుల నుంచి వసూలు చేస్తామని పేర్కొన్నారు. నగర సుందరీకరణ, ట్రాఫిక్ ఒత్తిడి నియంత్రణ, భారీవర్షాలు, గాలుల సమయంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధిత వర్గాలన్నీ సహకరించాలని కమిషనర్ కోరారు.

ముంపు సమస్య నివారణకు చర్యలు

కాకినాడ దుమ్ములపేట రైల్వే ట్రాక్ కింద స్తంభించిపోతున్న చెత్త సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామనిఈ కమిషనర్ వెంకటరావు తెలిపారు. వర్షాల నేపథ్యంలో శుక్రవారం ఆయన అధికారులతో కలిసి దుమ్ములపేట రైల్వే ట్రాక్ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి బాక్స్ కల్వర్ట్, పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టులను పరిశీలించారు. ట్రాక్ క్రింది ప్రాంతంలో నిలిచిపోతున్న చెత్త వల్ల నీరు స్తంభించిపోతున్న సమస్యపై అధికారులతో చర్చించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కేఎస్‌పీఎల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గతంలో కేఎస్‌పీఎల్ సంస్థ వీటి నిర్వహణను పర్యవేక్షించేదని, అయితే సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం ఆ పనులు జరగడం లేదన్నారు. త్వరలోనే ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశమై శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. కాకినాడ నగరంలో చేపట్టిన పూడికతీత పనుల వల్ల వర్షం వల్ల ఎక్కడా ముంపు సమస్య ఎదురుకాలేదని కమిషనర్ పేర్కొన్నారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి తదితరులు ఉన్నారు.

వర్షంలోనూ కార్మికుల నిరసన



రాక్ సిరామిక్స్ గేటు వద్ద వర్షంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించడంతో వారు చేస్తున్న ఆందోళన శుక్రవారం జోరును కురుస్తున్న వర్షంలోనూ కొనసాగింది. తొలగించిన కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివ నారాయణ, సుబ్బారావు తదితరులు నినాదాలు చేశారు.

బ్యాంకులతో దేశం సర్వతోముఖాభివృద్ధి

కాకినాడ రూరల్: బ్యాంకులతో దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని బ్యాంక్ ఉద్యోగుల సంఘం సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.ఆదినారాయణమూర్తి పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1969 జూలై 19న ప్రైవేట్ నియంత్రణ ఉన్న 14 బ్యాంకులను జాతీయం చేయడంతో అప్పటి నుంచి బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం జరుపుకొంటున్నామని, పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకుల సేవలతో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు రుణాలు మంజూరుతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదినారాయణతో పాటు మరో బ్యాంకు ఉద్యోగి దుర్గా ప్రసాద్‌లను అడబాల రత్నప్రసాద్ చింతపల్లి సుబ్బారావు, రాజా, రాఘవరావు, తదితరులు సన్మానించారు.

పారామెడికల్ లెక్చర్ గ్యాలరీ రేపు ప్రారంభం



ప్రారంభోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు వెంకటరావు, శేషగిరిరావు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ ఎదురుగా ఆర్ఎంసీ సెంట్రల్ లైబ్రరీని ఆనుకొని ఉన్న పారా మెడికల్ లెక్చర్ గ్యాలరీ ఆధునీకరణ అనంతరం ఆదివారం పునః ప్రారంభించనున్నట్లు 1980 ఆర్ఎంసీ వైద్య విద్యార్థుల బృందం తరపున విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ వారా వెంకటరావు, పల్మనాలజీ నిపుణుడు డాక్టర్ శేషగిరిరావు వెల్లడించారు. ఈ మేరకు వారు శుక్రవారం భవంతి ఆవరణలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న లెక్చర్ గ్యాలరీని 1980 రంగరాయ పూర్వపు విద్యార్థుల బృందం ఆధునీకరించేందుకు నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా బ్యాచ్ సభ్యులంతా సమష్టిగా తమ వంతు సహకారంగా రూ.60 లక్షలు సమకూర్చి ఆధునీకరణకు అంకురార్పణ చేశారన్నారు. సుమారు నాలుగు నెలల పాటు నిత్య పర్యవేక్షణలో పనులు కొనసాగించి సకల హంగులతో ఓ అద్భుత భవనంగా దీనిని తీర్చిదిద్దామన్నారు. ఆర్ఎంసీ ఆవిర్భావం నుంచి పాథాలజీ, ఫార్మకాలజీ తరగతుల బోధన ఈ భవంతిలోనే జరుగుతున్నాయరు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు రంగరాయ పూర్వపు విద్యార్థి, కైకలూరు ఎంఎల్ఏ, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ భవంతిని ప్రారంభిస్తారన్నారు. 1980 బ్యాచ్ పూర్వపు విద్యార్థులతో పాటు ఎందరో వైద్య ప్రముఖులు హాజరు కానున్న ఈ కార్యక్రమానికి వచ్చే ఆహ్వానితులకు ఎటువంటి సమాచారం కావాలన్నా డాక్టర్ వి.వెంకటరావు, డాక్టర్ శేషగిరిరావులను 98850 88895, 99125 77664 నంబర్లలో సంప్రదించాలన్నారు. మీడియా సమావేశంలో రెడ్నం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'భోజనాన్ని' సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం పోషణ్ పేరిట ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న స్వచ్ఛంద సంస్థ భోజనాన్ని నాసిరకంగా వండుతోందని వస్తున్న ఫిర్యాదుల మేరకు భోజనాన్ని రుచి చూసి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. హెచ్‌ఎం మీనామాధురి, ఉపాధ్యాయులు హనుమంతురావు, ప్రకాష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

10వ తరగతికి పునాది వేసుకోవాలి
ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: 10వ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఎనిమిదో తరగతి నుంచే పునాది వేసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలో మాధవపట్నం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 'గ్రేడ్-ఎ'లు పెరగాలని సూచించారు. 8వ తరగతి నుంచి పాఠ్యాంశాలపై దృష్టి సారిస్తే విజయం సులభతరం అవుతుందని చెప్పారు. ఈ మేరకు ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీలో మండల పరిధిలో 16 మంది విద్యార్థులు ఎంపికవగా 14 మంది ప్రభుత్వ పాఠశాలల వారేనని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి వారి నుంచి సమాచారం సేకరించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.

ఏలేశ్వరం నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు

జగ్గంపేట: ప్రతి నెలా పౌర్ణమికి అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షిణకు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసు నడుపుతున్నట్టు ఆ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. జగ్గంపేటలో అరుణాచలం వెళ్లే బస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అరుణాచలం గిరిప్రదక్షిణతో పాటు శ్రీకాళహస్తి, కంచి, కాణిపాకం, విజయవాడ తదితర పుణ్యక్షేత్రాలను చూపిస్తారన్నారు. ఏపీఎస్ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.